ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
శనివారం 20 ఏప్రిల్ 2024


ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న సీఎం స్టాలిన్, ఆయన సతీమణి దుర్గా


తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు






పోటెత్తిన ఓటరు

- ఓటు హక్కు వినియోగించుకున్న గవర్నర్, సీఎం దంపతులు
- క్యూలో నిలబడి ఓటు వేసిన ప్రముఖులు


ఓటేసిన సీఎం దంపతులు


అన్నామలై - ఎడప్పాడి పళనిస్వామి


డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, కుమారులు


ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం


తమిళిసై


తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతి


గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా రాజకీయ పార్టీల నేతలందరూ క్యూలైన్లలో నిలిచి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొంతమంది అభ్యర్థులు తమకు తామే ఓటు వేసుకోగా, మరికొంతమంది తమ ఓటు వేసుకోలేకపోయారు. శుక్రవారం ఉదయమే వీరంతా పోలింగ్ కేంద్రాల వద్ద సామాన్యులతో క్యూలైన్లలో నిలిచి ఓటేశారు. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి సతీసమేతంగా వేళచ్చేరి రోడ్డులోని అడ్వాంట్ క్రిస్టియన్ మిడిల్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్ తేనాంపేట ఎస్ఐఈటీ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్పీకర్ అప్పావు తిరునల్వేలి జిల్లా మణక్కుడి పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. ఇదే విధంగా మంత్రి కేఎన్ నెహ్రూ తిరుచ్చి తిల్లైనగర్ మక్కల్ మండ్రం పోలింగ్ కేంద్రంలో, మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి తిరుచ్చి సిరుమలర్ ప్రైమరీ పాఠశాలలో ఓటేశారు. కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం శివగంగ జిల్లా కండనూరు పోలింగ్ కేంద్రంలో ఓటేశారు.

తాంబరంలో సెల్వపెరుంతగై...

టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై తాంబరం మణిమంగళం పోలింగ్ కేంద్రంలో, టీఎంసీ నేత జీకే వాసన్ చెన్నై ఆళ్వార్‌పేట భీమనన్ గార్డెన్ కార్పొరేషన్ స్కూలులో ఏర్పాటైన పోలింగ్ కేంద్రంలో ద్రావిడ కళగం నేత కే వీరమణి కార్పొరేషన్ మహోన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం పెరియకుళం సమీపం తెన్‌కరై సెవెన్త్‌డే పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ తాంబరం కార్పొరేషన్ మాధ్యమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటేశారు.

తేనాంపేటలో కమల్‌హాసన్...

మక్కల్‌నీదిమయ్యం నేత కమల్‌హాసన్ తేనాంపేట ఎల్డామ్స్ రోడ్డు పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో, మనిదనేయ మక్కల్ కట్చి నేత జవాహిరుల్లా అరుంబాక్కం జగన్నాధర్ రోడ్డులోని గుడ్‌హోప్ మెట్రిక్యులేషన్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో, పెరుంతలైవర్ మక్కల్ కట్చి నేత ఎన్ఆర్ ధనపాలన్ వలసరవాక్కం గుడ్ షెఫర్డ్ మహోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్ నాగర్‌కోవిల్ ఎస్ఎల్‌బీ ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పోలింగ్ కేంద్రం లో, సమత్తువ మక్కల్ కళగం నేత ఎర్నావూరు నారాయణన్ తండయార్‌పేట మాద్రస్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో ఏర్పాటైన పోలింగ్ కేంద్రంలో, నార్త్ చెన్నై బీజేపీ అభ్యర్థి పాల్ కనకరాజ్ వేప్పేరి రిథర్డన్ రోడ్డులోని బాలర్ విద్యానిలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

శిలువంపాళయంలో ఈపీఎస్...

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి కుటుంబసభ్యులతో కలిసి సేలం సమీపంలోని తన స్వగ్రామం శిలువంపాళయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. మంత్రి ఉదయనిధి సతీమణి కృత్తికతో కలిసి తేనాంపేట ఎస్ఐఈటీ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో, మరో మంత్రి పీకే శేఖర్‌బాబు నార్త్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని చెల్లప్ప వీధిలోని కార్పొరేషన్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కరూరు జిల్లా తూత్తుపట్టి పోలింగ్ కేంద్రంలో తెలంగాణా మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై ఆమెభర్త సౌందరరాజన్, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, ఆమె కుమారులు షణ్ముఖపాండ్యన్, విజయ ప్రభాకరన్ సాలిగ్రామం కావేరి స్కూలు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

దిండివనంలో రాందాస్...

పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ దిండివనం మారియమ్మన్ ఆలయ వీధిలోని మరకతాంబిగై ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, ఆయన సతీమణి సౌమ్యా, కుమార్తెలు సంయుక్త, సంఘమిత్ర ఇతర కుటుంబ సభ్యులు కూడా ఆ కేంద్రంలోనే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎండీఎంకే నేత వైగో, ఆయన తనయుడు తిరుచ్చి అభ్యర్థి దురై వైగో కళింగపట్టిలోని పోలింగ్ కేంద్రంలో, వీసీకే నేత తిరుమావళవన్ అరియలూరు సమీపంలోని అంగనూరు ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. సీపీఎం నేత బాలకృష్ణన్ చిదంబరంలోని పోలింగ్ కేంద్రంలో సీపీఐ నేత ముత్తరసన్ తిరుత్తురైపూండి పోలింగ్ కేంద్రంలో, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ చెన్నై నీలాంగరై కపాళీశ్వరనగ్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటైన పోలింగ్ బూత్‌లో ఓటేశారు.


మోటారు సైకిల్‌పై పుదుచ్చేరి సీఎం రంగస్వామి


యోగా గురు జగ్గీ వాసుదేవన్


మంత్రి ఉదయనిధి దంపతులు - ఒ.పన్నీర్ సెల్వం- సెల్వపెరుందగై - ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహు - చెన్నై పోలీస్ కమిషనర్ శంకర్ జివాల్ -డా.జె.రాధాకృష్ణన్ - మురుగన్ - కనిమొళి - స్పీకర్ అప్పావు

1,461 కేంద్రాల్లో అంతా మహిళాధికారులే


థౌజెండ్‌లైట్స్‌లోని ఓ కేంద్రంలో మహిళాధికారులు

ప్యారీస్, ఏప్రిల్ 19 : రాష్ట్రంలో శుక్రవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన 1,461 పోలింగ్ కేంద్రాల్లో అందరూ మహిళా సిబ్బందే ఉండడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా 39 లోక్‌సభ నియోజకవర్గాలలో శుక్రవారం పోలింగ్ ప్రక్రియ చురుగ్గా సాగింది. గ్రేటర్ చెన్నైలో 3726 పోలింగ్ కేంద్రాల్లో 48,69లక్షల మంది ఓటేసేందుకు వసతులు కల్పించారు. కాగా 39 శాతం పోలింగ్ కేంద్రాల్లో మహిళలు మాత్రమే ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. ఆ విధంగా 16 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 1461 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహణ అధికారి నుంచి కానిస్టేబుళ్ల వరకూ అందరూ మహిళలే కావడం గమనార్హం. ఇలా ఉండగా ఈ పోలింగ్ కేంద్రాలను మాత్రం గులాబీ (పింక్) రంగులో డిజైన్ చేయడం విశేషం. ప్రజాస్వామ్య దేశంలో మహిళలకు గౌరవం పెంచే విధంగా ఎన్నికల సంఘం ఈ పింక్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆర్కేనగర్ ప్రాంతంలో 30 మంది, పెరంబూరులో 66 మంది, కొళత్తూరులో 49 మంది, విల్లివాక్కంలో 38 మంది, తిరువికా నగర్‌లో 21 మంది, ఎగ్మూరులో 48 మంది, రాయపురంలో 40 మంది, హార్బర్‌లో 18, ట్రిప్లికేన్‌లో 62, థౌజెండ్ లైట్స్ 145 మంది, అన్నానగర్‌లో 140 మంది, విరుగంబాక్కంలో 183మంది, సైదాపేటలో 158, టినగర్‌లో 163, మైలాపూరులో 187 మంది, వేళచ్చేరిలో అత్యధికంగా 113 మంది చొప్పున అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా మహిళలే పోలింగ్ విధులను నిర్వహించారు. కాగా నగరంలో అన్ని పోలింగ్ కేంద్రాలలో క్యూఆర్ గుర్తు కలిగిన పోస్టర్లు అంటించారు. దానిని స్కాన్ చేసి ఎన్నికల అవగాహనకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పేవారికి బహుమతులు కూడా ఈసీ ప్రకటించింది. ఈ పింక్ కేంద్రాల్లో గర్భిణులు, వృద్ధులు, చంటి పిల్లలతో వచ్చే మహిళలకు ఓటేసేందుకు ప్రత్యేక క్యూలైన్ కూడా అందుబాటులో ఉంచారు. అంతే కాకుండా ఎండలు మండుతున్న వేళ అలసట చెందిన మహిళలు కాసేపు విశ్రాంతి తీసుకునేలా వసతి కల్పించారు. ముఖ్యంగా పిల్లలు ఆడుకునేందుకు బొమ్మలు కూడా సమకూర్చారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- 72.09 శాతం నమోదు


ట్రిప్లికేన్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 39 లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల్లో ఓటరు పోటెత్తాడు. ఎండవేడిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కు వినియోగించుకున్నాడు. శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. అనంతరం భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. రాత్రి ఏడు గంటలకు అందిన సమాచారం మేరకు 39 నియోజకవర్గాల్లో 72.09 శాతం పోలింగ్ జరిగినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు ప్రకటించారు. కొన్ని చోట్ల పోలింగ్ ఆలస్యంగా ముగియనుండటంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. రాష్ట్రమంతటా చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నిక ప్రశాతంగా ముగిసిందని ఆయన ప్రకటించారు.


రాష్ట్రం మొత్తమ్మీద 6.23 కోట్ల మంది ఓటర్లుండగా, అన్ని పార్టీలు, స్వతంత్రులు కలిపి 950 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎన్నికలకు గాను 1.58 లక్షల ఈవీఎంలు వినియోగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 68,321 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇదిలా వుండగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని 20 గ్రామాలకు చెందిన ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. పరందూరు విమానాశ్రయ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఏకనాపురం సహా 13 గ్రామాల ప్రజలు, స్థానిక సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరికొన్ని గ్రామాల ప్రజలు ఎన్నికలను బహిష్కరించడం, కొన్ని పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలు ప్రారంభంలో మొరాయించడం వంటి స్వల్ప ఘటనలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించేలా షామియానాలు ఏర్పాటు చేశారు. మినరల్ వాటర్ సరఫరా చేశారు. దివ్యాంగులకు, 85యేళ్ల పైబడిన వృద్ధులకు ఉచిత వాహన సదుపాయం కల్పించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా ఓటర్లు బారులు తీరటంతో అధికారులు క్యూలైన్లలో వున్నవారికి టోకెన్లు పంపిణీ చేసి ఓటు వేసేందుకు అనుమతించారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు 63.20 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 7 గంటలకు 72.09 శాతం పోలింగ్ నమోదైంది. ఆ మేరకు ధర్మపురిలో 75.44, నామక్కల్‌లో 73.29, ఆరణిలో 73.77, కళ్లకురిచ్చిలో 75,67, కరూరులో 74.05, చిదంబరంలో 74.87, పెరంబలూరులో 74.46, తిరువణ్ణామలైలో 73.35, సేలంలో 73.55, అరక్కోణంలో 73.92 వేలూరులో 73.04, విల్లుపురంలో 73.49 కృష్ణగిరిలో 72.96, ఈరోడ్ 64.50, దిండుగల్‌లో 64.34, నాగపట్టినంలో 64.21 ఓట్లు పోలయ్యాయి. కడలూరులో 64,10, నీలగిరిలో 63.88, విరుదునగర్‌లో 72.29, మైలాడుదురైలో 71.45, పొల్లాచ్చిలో 72.22, తేనిలో 71.74, తెన్‌కాశిలో 71.06, తూత్తుకుడిలో 70.93, రామనాధపురంలో 71.05, తంజావూరులో 69.82, కన్నియాకుమారిలో 70.15, శివగంగలో 71.05, తిరుచ్చిలో 71.20, కాంచీపురంలో 72.99, తిరువళ్లూరులో 71.87 కోవైలో 71.17, తిరుప్పూరులో 72.02, తిరునల్వేలిలో 70.46, మదురైలో 68.98, శ్రీపెరుంబుదూరులో 69.79, నార్త్ చెన్నైలో 69.26, సెంట్రల్ చెన్నై లో 67.35, సౌత్ చెన్నైలో 67.8 శాతం మేరకు ఓట్లు నమోదయ్యా యి. కాగా వేలూరు లోక్‌సభ నియోజక వర్గ పరిధిలో వేలూరు శాసనసభ నియోజకవర్గం 130వ కేంద్రంలో 47 ఓట్లు అధికంగా పోలైనట్టు సమాచారం

రాశిపాళయంలో రాత్రి 9 వరకు పోలింగ్...

కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో సూలూరు సమీపంలోని రాశిపాళయం పోలింగ్ కేంద్రంలో ఈవీఎం సక్రమంగా పనిచేయకపోవడంతో ఆ కేంద్రంలో సాయంత్రం ఆరుగంటలకు ముగియాల్సిన పోలింగ్‌ను రాత్రి తొమ్మిది గంటల వరకూ ఎన్నికల అధికారులు పొడిగించారు. శుక్రవారం మధ్యాహ్నం నుండి ఆ కేంద్రంలోని ఈవీఎంలు సక్రమంగా పనిచేయలేదు. దీంతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు కబురు చేశారు. ఇంజనీర్లు ఆలస్యంగా వచ్చి ఈవీఎంను మరమ్మతు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు సాగించారు. రాత్రి ఏడుగంటల తర్వాత ఈవీఎం మరమ్మతు పూర్తయ్యింది. ఆ తర్వాత పోలింగ్ ప్రారంభమైంది.

మొండికేసిన ఈవీఎంలు..

చెన్నై సహా పలు జిల్లాల్లో శుక్రవారం ఉదయం పోలింగ్ ప్రారంభమయ్యే సమయంలోనే ఈవీఎంలు పనిచేయకుండా మొరాయించాయి. వాటిని మరమ్మతు చేసిన తర్వాత గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అన్నానగర్ కందసామి కాలేజీలోని 41వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం పనిచేయలేదు. అప్పటికే ఆ కేంద్రం వెలుపల డీఎంకే అభ్యర్థి కళానిధి వీరాసామి సహా ఓటర్లు బారులు తీరారు. దీంతో కొత్త యంత్రాన్ని తెప్పించి 45నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంబించారు. ఆదంబాక్కం న్యూకాలనీ వీధిలోని 261 నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం పనిచేయక ఉదయం 8.40 గంటలకు కొత్త ఈవీఎంతో పోలింగ్ ప్రారంభించారు. నంగనల్లూరు హిందూ కాలనీ 385 నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఉదయం 8.30 గంటలకు 95 ఓట్లు నమోదైన తర్వాత ఈవీఎం పనిచేయక మొరాయించింది. ఉదయం 9.30 గంటలకు కొత్త ఈవీఎం తెప్పించి పోలింగ్ ప్రారంభించారు. ఆండిపట్టి 57వ పోలింగ్ కేంద్రంలో, పళని శివగిరిపట్టి పోలింగ్ కేంద్రంలో తంజావూరు జిల్లా బూతలూరు పోలింగ్ కేంద్రంలో వేదారణ్యం వడవాళరస్తా పోలింగ్ కేంద్రంలో, ఈరోడ్ నియోజకవర్గం చిత్తేడులో కేఎస్బీ కాలనీ పోలింగ్ కేంద్రంలో, కోయంబత్తూరులోని పోతలూరు కేంద్రంలో ఈవీఎంలు పనిచేయక అరగంట నుంచి గంట దాకా ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఇదిలా ఉండగా కడలూరు ముత్తునగర్ పోలింగ్ కేంద్రంలో సాయంత్రం ఐదు గంటలకు ఉన్నట్టుండి ఈవీఎం పనిచేయకుండా మొరాయించింది. సాయంత్రం 6 గంటలైనా ఆ యంత్రాన్ని మరమ్మతు చేయకపోవడంతో క్యూలైన్లలో ఉన్న 120 మంది ఓటర్లకు టోకెన్లు పంపిణీ చేశారు.


బూతలూరు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్‌రూంల్లో నిక్షిప్తం

- జూన్ 3 వరకు నిరీక్షణం


ఎగ్మూరులోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎంకు సీలు వేస్తున్న అధికారులు

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలతో పాటు విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్‌రూముల్లో నిక్షిప్తమైంది. అయితే ఈ ఎన్నిక ఫలితం కోసం 45 రోజుల పాటు అభ్యర్థులు, ప్రజలు నిరీక్షించాల్సిందే. దీంతో స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియగానే ఏజెంట్ల సమక్షంలో ఎన్నికల అధికారులు ఈవీఎంలకు సీలు వేశారు. అంతేగాక పటిష్ఠమైన బందోబస్తు మధ్య, సీసీ కెమెరాల డేగకన్ను పర్యవేక్షణలో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలించి గదులకు సీలు వేశారు. అంతేగాక స్ట్రాంగ్ రూంలకు ఐదంచెల భద్రత ఏర్పాటు చేశారు. రేయింబవళ్లు సీసీ కెమెరాల డేగకన్ను నిఘాతో పాటు సాయుధ బలగాలు భద్రత కల్పించనున్నాయి. ఈ ఎన్నికల కోసం గత నెల 16వ తేదీ ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే. ఆ వెంటనే 20 నుంచి 27వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, 28న నామినేషన్ల పరిశీలన, 30వ తేదీ నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం కల్పించారు. అనంతరం డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి, అన్నాడీఎంకే, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి, బీఎస్పీ, నామ్ తమిళర్ కట్చి పార్టీలతో పాటు స్వతంత్రులు కలిపి మొత్తం 950 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయా కూటములు, పార్టీల నేతలు రకరకాల ప్రచారం చేపట్టారు. ఈ నెల 18వ తేదీతో ప్రచారం ముగియగా, శుక్రవారం ఒకే విడతలో ఎన్నిక జరిగింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. దేశవ్యాప్తంగా ఏడు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైన, కేంద్ర ఎన్నికల కమిషన్.. తొలివిడతలోనే తమిళనాట ఒకేరోజున ఎన్నిక పూర్తి చేసింది. ఈ ఎన్నికల ఫలితం జూన్ 4వ తేదీన వెలువడనుంది. అదే రోజున విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితం కూడా వెలువడనుంది.

విశ్రాంతి కోసం ఇతర ప్రాంతాలకు

లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఆయా పార్టీల నేతలు, అభ్యర్థులు, వారి అనుయాయులు విహారయాత్రలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇన్నాళ్లూ ప్రచారంతో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్న నేతలు.. ఇప్పుడు ఫలితం కోసం ఉత్కంఠతో ఎదురు చూడాల్సివస్తోంది. గతానికి భిన్నంగా 45 రోజుల పాటు ఫలితాల కోసం ఎదురు చూడాల్సి రావడంతో, మానసిక ఒత్తిడిని జయించేందు కోసం ఆయా నేతలు ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

సమాచార దృష్టిని

వేసవి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 19: వేసవి సెలవులను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల నడపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● 02122 జబల్‌పూర్-మదురై సూపర్ ఫాస్ట్ స్పెషల్ (గూడూరు-చెన్నై ఎగ్మూర్-తాంబరం మీదుగా) ఈ నెల 25, మే 2,9,16,23,30, జూన్ 6,13,20,27, జూలై 4,11,18,25 తేదీల్లో సాయంత్రం 4.25 గంటలకు జబల్‌పూర్‌లో బయల్దేరి మూడోరోజు అర్ధరాత్రి 12.15 గంటలకు మదురై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.02121 మదురై-జబల్‌పూర్ సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఈ నెల 20,27, మే 4,11,18,25, జూన్ 1,8,15,22,29 జూలై 6,13,20,27 తేదీల్లో రాత్రి 11.35 గంటలకు మదురైలో బయల్దేరి మూడో రోజు ఉదయం 7.40 గంటలకు జబల్‌పూర్ చేరుకుంటుంది.

● 08311 సంబల్‌పూర్-ఈరోడ్ (గూడూరు-పెరంబూర్-కాట్పాడి మీదుగా) వారంతపు స్పెషల్ మే 1,8,15,22,29, జూన్ 5,12,19,26 తేదీల్లో సంబల్‌పూర్‌లో ఉదయం 11.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.08312 ఈరోడ్-సంబల్‌పూర్ వారాంతపు స్పెషల్ మే 3,10,17,24,31, జూన్ 7,14,21,28 తేదీల్లో ఈరోడ్‌లో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది.

జూలైలోగా రైల్వేస్టేషన్లలో సీసీ కెమెరాలు

పెరంబూర్, ఏప్రిల్ 19: దక్షిణ రైల్వే పరిధిలోని 128 రైల్వేస్టేషన్లలో జూలై నెలాఖరులోగా సీసీ కెమెరాలు ఏర్పాటు జరుగుతుందని దకిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై బీచ్-వేళచ్చేరి, చెన్నై ఎగ్మూర్-విల్లుపురం మార్గాల్లోని 26 రైల్వేస్టేషన్లు, చెన్నై సెంట్రల్-గూడూరు మధ్య 17 రైల్వేస్టేషన్లు, చెన్నై-జోలార్‌పేట, అరక్కోణం-రేణిగుంట మార్గాల్లో 31 రైల్వేస్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుపనులు చేపట్టారు. ఇవి మినహా మరో 54 రైల్వేస్టేషన్లలో కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు, ఒక్కో స్టేషన్‌లో 10 నుంచి 25 సీసీ కెమెరాలుంటాయని దక్షిణ రైల్వే తెలిపింది.

రేషన్ ఉద్యోగుల బదిలీ

ఐసిఎఫ్, ఏప్రిల్ 19: రేషన్ ఉద్యోగులకు 10 కి.మీ పరిధిలోనే బదిలీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రేషన్ ఉద్యోగుల్లో పలువురు 40 నుంచి 90 కి.మీ దూరంలో ఉన్న దుకాణాల్లో పనిచేస్తున్నారు. ప్రతిరోజు అంత దూరం ప్రయాణం చేయలేక ఇబ్బందులు గురవుతున్నారు. తమ నివాస ప్రాంతాలకు దగ్గర ఉన్న దుకాణాలకు బదిలీ చేయాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ మేరకు సహకార శాఖ, 10 కి.మీ పరిధిలో బదిలీలు నిర్వహించాలని అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది.

రెండు నుంచి నాలుగు డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు


పెరంబూర్, ఏప్రిల్ 19: రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధరణం కన్నా రెండు నుంచి నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. అదే సమయంలో పశ్చిమ కనుమల కొండ ప్రాంతాలు, సరిహద్దు జిల్లాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. రాష్ట్రంలోని అంతర్ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38-42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 37-38, రాత్రి ఉష్ణోగ్రతలు 26.27 డిగ్రీలు నమోదయ్యే అవకాశముంది. అలాగే, సముద్రం నుంచి వీచే గాలుల ప్రభావంతో గాలిలో తేమ శాతం తగ్గి వేడిగాలులు వీచే అవకాశముంది. వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావడం తగ్గించాలని, అలాగే అత్యవసర పనులకు వెళ్లేవారు శీతల పానీయాలు, ఎక్కువగా నీరు, మజ్జిగ తీసుకోవాలని వాతావరణ కేంద్రం సూచించింది.

నీరు కావాలంటూ నగల చోరీ

పెరంబూర్, ఏప్రిల్ 19: మంచి నీరివ్వాలని కోరుతూ 8 సవర్ల నగలు లాక్కెళ్లిన అగంతకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కోవై సెల్వాపురం-పేరూరు రోడ్డులోని కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల సమీపంలో మల్లిక (70) అనే వృద్ధురాలు నివసిస్తోంది. సంఘటన జరిగిన రోజు మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా 40 ఏళ్ల వ్యక్తి కరపత్రాలతో ఇంటి వద్దకు వచ్చాడు. మీరు ఎవరని మల్లిక ప్రశ్నించగా, తాను ఓట్లు అభ్యర్థిస్తున్నానని, బయట ఎండ అధికంగా ఉందని, తాగేందుకు నీరు ఇవ్వాలని కోరాడు. మల్లిక నీటి కోసం ఇంట్లోకి వెళుతున్న సమయంలో ఆమె వెనుకగా వెళ్లిన సదరు వ్యక్తి, ఆమె మెడలోని 8 సవర్ల నగలు లాక్కొని మోటార్ సైకిల్‌పై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి అతని కోసం గాలిస్తున్నారు.

టపాసుల కర్మాగారంలో పేలిన యంత్రం

● మహిళకు గాయాలు


శిథిలాలను తొలగిస్తున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శివకాశి నేషనల్ కాలనీలో చందన మహాలింగం అనే వ్యక్తి నడుపుతున్న టపాసుల కర్మాగారంలో శుక్రవారం ఉదయం హీటర్ మిషన్ హఠాత్తుగా పేలింది. దీంతో ఆ కర్మాగారం భవనం పూర్తిగా ధ్వంసమైంది. ఈ దుర్ఘటనలో రాణి (35) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన సమాచారం తెలియగానే అగ్నిమాపక దళం, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని శిథిలాలను తొలగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

ఎరువుల కర్మాగారం మూసివేయాలని
ఐదుగ్రామాల్లో ఎన్నికల బహిష్కరణ

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుమంగళం సమీపం కల్లిక్కుడి - కారియపట్టి రహదారిలోని కే చెన్నంపట్టి గ్రామంలో నడుపుతున్న కేరళకు చెందిన ప్రైవేటు కర్మాగారాన్ని మూసివేయాలని కోరుతూ ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. ఆ కర్మాగారంలో కోడి మాంసం వ్యర్థాలు, మందుల వ్యర్థాల ద్వారా ఎరువులను తయారు చేస్తున్నారు. ఆ కర్మాగారం నుంచి వెలువడుతున్న పొగల కారణంగా కే చెన్నంపట్టి, కురాయూరు, ఓడైపట్టి, మేల్‌పట్టి, పేయ్‌కుళం గ్రామాలకు చెందిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోడంతో ఆ గ్రామస్థులు ధర్నా, రాస్తారోకో జరిపారు. ఈ నేపథ్యంలో ఆ కర్మాగారాన్ని మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఐదు గ్రామాల ప్రజలు శుక్రవారం ఎన్నికలను బహిష్కరించారు.

కోవై జిల్లాలో...

ఇదేవిధంగా కోయంబత్తూరు జిల్లాలోని గోపి రాశిపురం, కూలే గౌండన్‌పుదూరు గ్రామాలకు చెందిన ప్రజలు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించారు. ఈ రెండు గ్రామాల్లో వ్యవసాయ కూలీలే అధికంగా నివసిస్తున్నారు. అత్తికడవు- అవినాసి నీటి పథకాన్ని ప్రారంభించినప్పుడు వీరంతా ఆ పనుల్లో పాల్గొనేవారు. ఇటీవల ఆ పథకం పనులను అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామస్థులు అత్తికడవు - అవినాశి పథకాన్ని పూర్తి చేసి తమ ప్రాంతంలో నీటి కొరతను తీర్చాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలను బహిష్కరించారు. నడి రోడ్డులో ఓ ఆవును నిలబెట్టి దానికి వినతి పత్రం సమర్పించారు.


ఎన్నికలను బహిష్కరించి ఆవుకు వినతిపత్రం సమర్పిస్తున్న కోవై జిల్లా గోపిరాశిపురం గ్రామస్తులు

పార్థసారథి ఆలయంలో 23న చిత్తిరై బ్రహ్మోత్సవాలు

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం ట్రిప్లికేన్‌లోని పార్థసారథి ఆలయంలో చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి మే 2 వరకు జరుగనున్నాయి. ఈ నెల 22 సాయంత్రం ఆరు నుంచి అంకురార్పణ జరుగుతుంది. 23 ఉదయం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. వేకువజాము 5.30న ధర్మాదిపీఠం, రాత్రి 7.45 గంటలకు పొన్న వృక్షవాహనంలో స్వామివారిని ఊరేగించనున్నారు. 24 రాత్రి 7.45 గంటలకు సింహవాహన సేవ, 25 వేకువజాము 5.15 గంటలకు స్వామివారి గరుడసేవ, మధ్యాహ్నం 12 గంటలకు ఏకాంత సేవ, రాత్రి 7.45 గంటలకు హంస వాహనసేవ, 26 ఉదయం సూర్యప్రభ వాహన సేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ నిర్వహించనున్నారు. 27 ఉదయం నాచ్చియార్ అలంకారంలో స్వామివారికి పల్లకీ సేవ, రాత్రి హనుమంత వాహన సేవ, 28 ఉదయం చూర్ణాభిషేకం, ఉదయం 6.15 గంటలకు ఆనంద విమానసేవ, రాత్రి గజవాహన సేవ, 29 వేకువజాము 2.30 గంటల తరువాత పెరుమాళ్ రథం పైని ప్రత్యేక పీఠంపై కొలువుదీరనున్నారు. ఉదయం ఏడు గంటలకు రథోత్సవం, రాత్రి తొమ్మిది గంటలకు తోట్ట తిరుమంజనం జరుగుతుంది. 30 ఉదయం 6.15 గంటలకు పల్లకీలో వెన్నెముద్ద కృష్ణుడి రూపంలో స్వామివారి ఊరేగింపు, రాత్రి 8.15 గంటలకు అశ్వవాహనంలో స్వామివారు ఊరేగనున్నారు. మే ఒకటిన పల్లకీ తీర్థవారీ, రాత్రి అద్దాల పల్లకీపై స్వామివారి ఊరేగింపు జరుగుతాయి. మే 2న సప్తవర్ణం, చిన్న రథోత్సవం జరుగతాయి.



వైభవంగా జలకంఠేశ్వరుడి రథోత్సవం

వేలూరు, ఏప్రిల్ 19: స్థానిక కోటలోని జలకంఠేశ్వరాలయ రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ ఆలయ 43వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 13వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. అఖిలాండేశ్వరి సమేత జలకంఠేశ్వరుడు ప్రతిరోజు ప్రత్యేక అలంకరణలో వివిధ వాహనాల్లో ఊరేగారు. ఉత్సవాల్లో 7వ రోజైన శుక్రవారం ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణలో రథంపై ఉంచి మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు.

తిరుమలేశుడి సేవలో తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.


ఆలయం వద్ద జస్టిస్ జయచంద్రన్

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ లేదు

ఐసిఎఫ్, ఏప్రిల్ 19: రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ లేదని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కేరళ రాష్ట్రంలో ఉన్న ఫారాల్లో బాతులు, కోళ్లు వంటివి హెచ్5ఎన్1 అనే వైరస్‌కు గురై మృతిచెందుతున్నాయి. ఈ వ్యాధి రాష్ట్రంలోనూ వ్యాపిస్తుందన్న భీతి చెందుతున్నారు. ఈ విషయమై ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ... వ్యాధి లక్షణాలుగా జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుంటాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎవరికి బర్డ్ ఫ్లూ సోకినట్లు ఆనవాళ్లు లేవని, అయినప్పటికీ పశుసంవర్థక శాఖతో కలసి నిరోధక చర్యలు చేపట్టామని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

'హిట్స్'లో ముగిసిన 'ఏడీఐసీఎస్ 2024' సదస్సు


సదస్సులో విద్యావేత్తలు

అడయార్, ఏప్రిల్ 19: అడ్వాన్స్‌డ్ ఇన్ డేటా ఇంజనీరింగ్ అండ్ ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ సిస్టమ్ (ఏడీఐసీఎస్ 2024) అనే అంశంపై నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హెచ్ఐటీఎస్) రెండు రోజులు పాటు 'ఐఈఈఈ' పేరుతో అంతర్జాతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించింది. నగర శివారు ప్రాంతమైన పదూరులోని హిట్స్ బే రేంజ్ ప్రాంగణంలో ఈ నెల 17, 18 తేదీల్లో ఈ సదస్సు జరిగింది. ప్రపంచ సాంకేతిక, శాస్త్రీయ సహకార నెట్‌వర్క్ సృష్టిని ప్రోత్సహించడానికి ఒక విద్యా వేదికను అందించడమే లక్ష్యంగా ఏడీఐసీఎస్ 2024ను నిర్వహించినట్లు హిట్స్ విద్యా సంస్థ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ డాక్టర్ లింగ్ టాంక్ వాంగ్, ప్రత్యేక అతిథిగా ఆస్ట్రేలియాలోని టొరెన్స్ యూనివర్సిటీ డాక్టర్ అమ్మర్ అల జాబ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హిట్స్ చాన్సెలర్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీసీ, ప్రొ చాన్సెలర్ అశోక్ వర్గీసీ, సింగపూర్, యునైటెడ్ స్టేట్స్, ఆస్ట్రేలియా, మలేసియా, దుబాయ్ తదితర దేశాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు. ఇందులో 198 సెలెక్ట్ పత్రాలతో మొత్తం 796 పత్ర సమర్పణలు చేశారు ఈ పరిశోధనా పత్రాలు ఐఈఈఈ డిజిటల్ ఎక్స్‌ప్లోర్‌లో ప్రచురించనున్నారు.

పడవలో వెళ్ళి ఓటేసిన గిరిజనులు


ఓటు వేయడానికి పడవలో వెళ్తున్న గిరిజనులు

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా పేచ్చిపారై పంచాయతీ పరిధిలోని తచ్చమలై, మాంగమలై, ముడవన్‌పొట్రాలై సహా 10కిపైగా గిరిజన గ్రామాల ప్రజలు శుక్రవారం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పడవ ప్రయాణం చేశారు. ఆ గిరిజన ఓటర్ల కోసం పేచ్చిపారై ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి ఎన్నికల్లో గిరిజనులు పేచ్చిపారై జలాశయంలో పడవపై వెళ్ళి ఓటు వేయడం ఆనవాయితీ. ఆ ప్రకారమే శుక్రవారం ఉదయం ఆ గిరిజనులు జలాశయంలో పడవ ప్రయాణం చేసి, ఆ తర్వాత రెండు కిలోమీటర్ల దూరం వరకు నడిచి వెళ్ళి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ గిరిజనులు ఉత్సాహంగా ఓటు వేయడానికి బారులు తీరటం చూసి ఎన్నికల సిబ్బంది విస్తుపోయారు.

'ఇనీషియల్' ఓపీఎస్‌ను ముంచేనా....?


ఈవీఎంలో వరుస క్రమంలో ఐదుగురు ఓ.పన్నీర్‌సెల్వంలు

పెరంబూర్, ఏప్రిల్ 19: 'ఇనీషియల్ (ఇంటి పేరులోని మొదటి అక్షరం)' మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వంకు ఇబ్బందులు కలుగుతాయని ఆయన మద్దతుదారులు భావిస్తున్నారు. రామనాథపురం నియోజకవర్గంలో బీజేపీ కూటమిలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఓ.పన్నీర్‌సెల్వం పోటీచేశారు. ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు, ఇండిపెండెంట్లు మొత్తం 25 మంది బరిలో ఉన్నారు. వీరిలో ఐదుగురు పన్నీర్‌సెల్వం పేరుతో ఉన్నారు. ఈవీఎంలలో ఓపీఎస్ పేరు 22వ స్థానంలో ఉండగా, ఆయనకు 'పనసపండు' గుర్తు కేటాయించారు. ఆయన పై వరుసలో ముగ్గురు, కిందన ఒక పన్నీర్‌సెల్వం ఉన్నారు. పై భాగంలో ఉన్న ముగ్గురు ఇనీషియల్ 'ఓ' కావడంతో, వరుస క్రమంలో పన్నీర్‌సెల్వం.ఓలు నలుగురున్నారు. దీంతో ఒకే ఇనీషియల్‌తో ఓటర్లు తికమకపడి ఓట్లు తారుమారయ్యే అవకాశముందని, ఒకే ఇన్షియల్ ఉన్న ముగ్గురిని ఎలా ఎంపికచేసి ఎన్నికల బరిలో నిలిపారని ఓపీఎస్ అనుచరులు దిగ్భ్రాంతికి గురవుతున్నారు.

ఇండియా కూటమి గెలిస్తేనే
దేశానికి బంగారు భవిష్యత్

● కాంగ్రెస్ నేత పి. చిదంబరం



చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తేనే దేశానికి బంగారు భవిష్యత్ ఉంటుందని, లేకుంటే దేశంలో ప్రజాస్వామ్యం పత్తా లేకుండా పోతుందని, కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం పేర్కొన్నారు. శివగంగ జిల్లా కారైక్కుడి సమీపం కండనూరులోని పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కారైక్కుడిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రోడ్‌షోలను రద్దు చేసుకోవడానికి గల కారణాలు అందరికీ తెలుసని, కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న శివగంగ నియోజకవర్గంలో బీజేపీకి ఓట్లు రాలవని తెలిసే ఆఖరి క్షణంలో రోడ్‌షోలను రద్దు చేసుకున్నారని చెప్పారు. పదేళ్ల దేశం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందని, వీటిని చక్కదిద్దాలంటే ఇండియా కూటమిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద విషాదం

● వివిధ కారణాలతో ముగ్గురి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 19: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరిగిన లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని రెండు జిల్లాల్లో విషాదం నెలకొంది. ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన ముగ్గురు వృద్ధులు.. వివిధ కారణాలతో కన్ను మూశారు. సేలం, తిరువళ్లూరు జిల్లాల్లో ఈ ఘటనలు జరిగాయి. వివరాలిలా ... సేలం పాత సూరమంగళం ప్రాంతానికి చెందిన పళనిస్వామి (65) శుక్రవారం ఉదయం అదే ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న పళనిస్వామి హఠాత్తుగా స్పృహతప్పి కింద పడిపోయాడు. గమనించిన ఆయన భార్య.. ఇరుగుపొరుగు సాయంతో ఆయన్ని ప్రభుత్వానికి తరలించింది. కానీ ఈలోపే ఆయన తుదిశ్వాస విడిచాడు. ఈ ఘటనపై సూరమంగళం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా పళనిస్వామి సుదీర్ఘకాలంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.

మరో ఘటనలో... : సేలం జిల్లా కళ్లకుర్చి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సెంథారపట్టి పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి కొండయ్యపల్లి రోడ్డు ప్రాంతానికి చెందిన రంగస్వామి భార్య చిన్నపొన్ను (77) శుక్రవారం ఉదయం ఓటు వేసేందుకు వెళ్లింది. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే ముందు చేతికి సిరా వేసిన తర్వాత ఈవీఎం వద్దకు వెళ్లే సమయంలో చిన్నపొన్ను హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయింది. చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ ఘటనపై తమ్మంపట్టి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరువళ్లూరు జిల్లాలో..

తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపం నెమిలి గ్రామానికి చెందిన కనకరాజ్ (59) ఓటు వేసేందుకు క్యూలైన్‌లో వేచి ఉండగా హఠాత్తుగా స్పృహతప్పి కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతనిని ఆసుపత్రికి తరలించే క్రమంలో ఆయన మృతిచెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఓటర్లకు మొక్కల పంపిణీ



పెరంబూర్, ఏప్రిల్ 19: కాంచీపురం జిల్లాలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన ప్రజలకు జిల్లా యంత్రాంగం మొక్కలు పంపిణీ చేసింది. సిరుకావేరిపాక్కం ప్రాంతంలో 'గ్రీన్ పోలింగ్ బూత్' ఏర్పాటైంది. ఈ బూత్ ప్రాంగణాల్లో మామిడి, అరటి, కూరగాయల తోరణాలతో అలంకరించారు. ఈ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న వారికి జిల్లా యంత్రాంగం మొక్కలు ఉచితంగా అందజేసింది.

మలయాళంలో అభ్యర్థుల పేర్లు



పెరంబూర్, ఏప్రిల్ 19: నీలగిరి జిల్లాలో లోక్‌సభ అభ్యర్థుల పేర్లు మలయాళంలో ముద్రించారు. నీలగిరి నియోజకవర్గంలో డీఎంకే తరపున ఎ.రాజా, అన్నాడీఎంకే తరపున లోకేష్ తమిళ్‌సెల్వన్, బీజేపీ తరపున ఎల్.మురుగన్ సహా 16 మంది పోటీ చేశారు. జిల్లాలోని ఊటీ, కూడలూరు, కున్నూర్ తదితర శాసనసభ నియోజకవర్గాల్లో 20 శాతం మేర మలయాళీయులున్నారు. అందువల్ల జిల్లాలోని 1,629 పోలింగ్ కేంద్రాల వద్ద అంటించిన పోస్టర్లలో అభ్యర్థుల పేర్లు తమిళంతో పాటు మలయాళంలోనూ ముద్రించారు. రాష్ట్రంలో మలయాళీయులు అధికంగా నివసిస్తున్న నీలగిరి, కన్నియాకుమారి జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో తమిళం, మలయాళం భాషల్లో అభ్యర్థుల పేర్లు ముద్రించినట్లు అధికారులు తెలిపారు.

కాట్పాడిలో ఓటేసిన మంత్రి దురై మురుగన్


మంత్రి దురైమురుగన్ - డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్

వేలూరు, ఏప్రిల్ 19: స్థానిక కాట్పాడి డాన్ బాస్కో పాఠశాలలో శుక్రవారం ఉదయం ఈవీఎం మరమ్మతులకు గురికావడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ కేంద్రంలో మంత్రి దురై మురుగన్, ఆయన కుమారుడు, వేలూరు నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ ఓటు వేశారు. ఈ సందర్భంగా మంత్రి దురై మురుగన్ మాట్లాడుతూ.... బీజేపీకి తొత్తుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలో 'ఇండియా' కూటమి అధికారం చేపట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. మెకెదాటు డ్యాం నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించే ప్రసక్తే లేదని మంత్రి దురైమురుగన్ స్పష్టం చేశారు.

పోలింగ్ తీరు పరిశీలించిన కలెక్టర్


పోలింగ్ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 19: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నుంచి జిల్లాలో జరుగుతున్న పోలింగ్ తీరును ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. కలెక్టర్ వెంట మహిళ పథక డైరెక్టర్ నాగరాజన్, కలెక్టర్ పీఏ (ఎన్నికలు) సెల్వరాజ్ తదితరులున్నారు.

బీజేపీ గెలుపు తథ్యం : ఏసీ షణ్ముగం


ఓటు వేస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, ఏప్రిల్ 19: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు తథ్యమని ఆ పార్టీ అభ్యర్థి ఏసీ షణ్ముగం తెలిపారు. సత్తువాచేరిలోని పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానిగా మూడో సారి నరేంద్ర మోదీ అధికారం చేపట్టాలని రాష్ట్ర ప్రజల తీర్పు కూడా అలాగే ఉంటుందని ఆయన తెలిపారు.

బీజేపీ మద్దతుదారుల ఓట్ల గల్లంతు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

పెరంబూర్, ఏప్రిల్ 19: రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో బీజేపీ మద్దతుదారుల ఓట్లు గల్లంతయ్యాయని, ఆ ఓట్లను సవరించి రీ పోలింగ్ నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కోయంబత్తూర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అన్నామలై డిమాండ్ చేశారు. కోవైలో శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉందన్నారు. మృతిచెందిన భర్త పేరు ఓటరు జాబితాలో ఉండగా, జీవించిన ఆయన భార్య పేరు జాబితాలో లేదన్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలో పేర్లు లేని వారు అధికారులతో వాగ్వివాదానికి దిగారన్నారు. కోవై నియోజకవర్గంలో సుమారు లక్ష ఓట్లు గల్లంతయ్యాయన్నారు. ముఖ్యంగా, ఓటు వేద్దామని ఎంతో ఆశతో విదేశాల నుంచి వచ్చిన వారి పేర్లు ఓటరు జాబితాలో లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని అన్నామలై తెలిపారు.

ఐదు రూపాయల డాక్టర్ ఓటు గల్లంతు


ఓటు వేసేందుకు వచ్చిన చెన్నై డాక్టర్

పెరంబూర్, ఏప్రిల్ 19: మైలాడుదురై టీపీటీఆర్ జాతీయ మహోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన చెన్నైకి చెందిన ఐదు రూపాయల వైద్యుడు రామమూర్తి పేరు ఓటరు జాబితాలో లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అలాగే, మహారాష్ట్ర నుంచి స్వగ్రామానికి ఓటు వేసేందుకు వచ్చిన రాజ్‌కుమార్ పేరు కూడా ఓటరు జాబితాలో లేకపోవడంలో పోలింగ్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఈ పోలింగ్ కేంద్రంలో మాత్రమే సుమారు 450 ఓట్లు ఉద్దేశపూర్వకంగా తొలగించినట్లు పీఎంకే అభ్యర్థి స్టాలిన్ ఆరోపిస్తూ రాస్తారోకోకు దిగడం కలకలం రేపింది.

మోదీని ప్రధాని అభ్యర్థిగా బీజేపీ ప్రకటించలేదేం?

● అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూరు రాజు

పెరంబూర్, ఏప్రిల్ 19: బీజేపీ నిబంధనల ప్రకారం రెండు సార్లు కంటే ఎక్కువగా ఎవరూ ప్రధాని పదవిలో ఉండేందుకు వీలు లేదు, అందువల్ల ఆ పార్టీ కూడా ఇంకా ప్రధాని అభ్యర్థిని ప్రకటించలేదని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సెల్లూర్ రాజు తెలిపారు. మదురై మీనాక్షి మహిళా కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... తమిళనాడు ద్రావిడ భూమి అని, ఇక్కడ డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పోటీ ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే మెజార్టీ విజయాలు సాధిస్తుందని తెలిపారు. బీజేపీ నిబంధనల ప్రకారం తదుపరి ప్రధాని అభ్యర్థి ఎన్నికల ఫలితాల అనంతరం నిర్ణయించే అవకాశముందని, ఆ సమయంలో ప్రధానిగా దేశానికి, రాష్ట్రానికి మేలుచేసే వ్యక్తిని చూసి తాము మద్దతు ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే ఓ.పన్నీర్‌సెల్వం చేతుల్లోకి వెళ్తుందనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... పనస పండు కోసం ఈగలు వస్తాయోమో కానీ, అన్నాడీఎంకే కార్యకర్తలు ఎక్కడికి వెళ్లరని సెల్లూరు రాజు తెలిపారు.

రాష్ట్రంలోని పలు చోట్ల తమ ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు..


కాంగ్రెస్ నేత చిరంజీవి - సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ దంపతులు - అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ - టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ - డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ - ద్రావిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి - డాక్టర్ సునీల్ - రాధిక-శరత్‌కుమార్

ఓటేసిన తారలు

● క్యూలైన్లలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్న సినీ ప్రముఖులు



భారతీరాజా - మనోజ్ భారతీరాజా

నాజర్ దంపతులు

హీరో శివకార్తికేయన్

హీరోయిన్ నమిత దంపతులు

కుమారుడితో వయ్యాపురి

ఓటు హక్కును వినియోగించుకున్న విజయ్ సేతుపతి

నటి స్నేహ దంపతులు

ఆర్.వి. ఉదయకుమార్ దంపతులు

యోగిబాబు దంపతులు

అరుణ్ విజయ్ దంపతులు



ఓటు హక్కు వినియోగించుకున్న నటి త్రిష - ఖుష్బూ - సుందర్ కుటుంబం



సూపర్‌స్టార్ రజనీకాంత్




ఎంఎన్ఎం అధినేత కమల్ హాసన్ - హీరో అజిత్



ఓటు వేసేందుకు వెళ్తున్న హీరో విజయ్



ఓటు హక్కు వినియోగించుకున్న హీరో ధనుష్

అడయార్, ఏప్రిల్ 19: నిత్యం తళుకుబెళుకుల వెలుగుల మధ్య తళుక్కుమనే తారలు దిగివచ్చాయి. సాధారణ ప్రజలతో కలిసి, క్యూలైన్లలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నాయి. తద్వారా సామాన్యులకు ఆదర్శంగా నిలబడడంతో పాటు ఓటు విలువను ప్రపంచానికి చాటిచెప్పాయి. సినీరంగానికి చెందిన పలువురు ప్రముఖులు తమ తమ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి దశ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగిన విషయం తెల్సిందే. ఈ పోలింగ్‌లో సూపర్‌స్టార్ రజనీకాంత్, ఎంఎన్ఎం అధినేత, హీరో కమల్ హాసన్, తమిళగ వెట్రి కగళం అధ్యక్షుడు, అగ్రహీరో విజయ్, చియాన్ విక్రమ్, హీరో సూర్య, కార్తీ, శివకుమార్, పార్తిబన్, విశాల్, హాస్య నటుడు యోగిబాబులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యోగిబాబు వలసరవాక్కంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నుంగంబాక్కంలో ఉన్న హిందూ దేవాదాయ మంత్రిత్వ శాఖ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. హీరోలు సూర్య, కార్తీ, శివకుమార్‌లతో పాటు దర్శకుడు భారతీరాజా, ఆయన కుమారుడు మనోజ్ భారతీరాజా టి నగర్‌లోని హిందీ ప్రచార సభ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నటుడు జయం రవి, ఆయన సతీమణి ఆర్తి ఆళ్వార్‌పేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ స్కూల్‌లో, దర్శక నటుడు ప్రదీప్ రంగనాథన్ మడిప్పాక్కంలోని కింగ్స్ మెట్రిక్ స్కూల్‌లో, దర్శకుడు మారి సెల్వరాజ్ తిరునెల్వేలిలోను,స్టెల్లా మేరీస్ కాలేజీలో రజనీకాంత్, తేనాంపేటలోని తిరువళ్ళువర్ వీధిలోని కార్పొరేషన్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కీల్పాక్కంలోని చెన్నై స్కూల్‌లో నటుడు విజయ్ సేతుపతి, కొట్టూరుపురంలోని ఏఎంఎం స్కూల్‌లో వరలక్ష్మి, వలసరవాక్కంలోని దేవి అకాడెమీలో నాజర్ దంపతులు, టీటీకే రోడ్డులోని సెంట్ ఫ్రాన్సిసల్ జేవియర్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ధనుష్, నటి త్రిష ఓటు వేశారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ టి.నగర్‌లోని శారద హయ్యర్ సెకండరీ స్కూల్‌లో, అశోక్ నగర్‌లోని జవహర్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో నటుడు రాఘవ లారెన్స్, నటుడు శివకుమార్ మదురైలో, కేకే నగర్ నిర్మలా స్కూల్‌లో దర్శక నటుడు పార్తిబన్ ఓటు వేశారు. అలాగే, మిగిలిన సినీ నటులు, దర్శక నిర్మాతలు, సహాయ నటీనటులు ఓటు వేసేందుకు పోటీ పడ్డారు.



సోదరులు సూర్య - కార్తీ - చియాన్ విక్రమ్ - హీరో విశాల్



ఓటు వేసినట్టుగా వేలు చూపిస్తున్న వడివేలు



ఐశ్వర్య రజనీకాంత్ - దర్శక నటుడు పార్తిబన్



రాఘవ లారెన్స్ - జీవీ ప్రకాష్ కుమార్ - వేల్స్ చాన్సలర్ ఐసరి కె.గణేష్



గాయత్రి రఘురాం - అన్నాడీఎంకే ప్రచార కార్యకర్త, నటి వింధ్య - సినీ నటి గౌతమి- ఐశ్వర్య రాజేష్ - నటి ఆండ్రియా - అతుల్య రవి - క్యూలో నిల్చొనివున్న పా.రంజిత్ - శశికుమార్ - నటి అదితి బాలన్ - దర్శకుడు ఎన్.లింగుస్వామి - దర్శకుడు అమీర్ - హీరో ప్రశాంత్



పారా మిలిటరీ బలగాల పహారాలో పోలింగ్ కేంద్రం

చెన్నై నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ప్రజలు

పోలింగ్ కేంద్రానికి స్వయంగా వచ్చిన శతాధిక వృద్ధురాలు

ఓటెయ్యడానికి లండన్ నుంచి వచ్చిన
చెన్నైవాసికి చేదు అనుభవం



ఓటరు గుర్తింపు కార్డును చూపుతున్న పాల్‌రాజ్

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం లండన్ నుంచి వచ్చిన చెన్నై చూళైమేడు వృద్ధుడికి చేదు అనుభవం ఎదురైంది. చూళైమేడుకు చెందిన పాల్‌రాజ్ (67) లండన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు ఓటరు గుర్తింపు కార్డు కూడా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తన ఓటు వేసేందుకు పాల్‌రాజ్ రూ.150లక్షలు ఖర్చుచేసి విమానంలో బయలుదేరి చూళైమేడుకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం పోలింగ్ కేంద్రానికి వెళ్ళినప్పుడు ఓటర్ల జాబితాల్లో ఆయన పేరు లేదని, తొలగించబడిందని తెలుసుకుని పాల్‌రాజ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషయమై పోలింగ్ కేంద్రం అధికారులను అడిగినప్పుడు జాబితాలో పేరు లేకుండా, బూత్ స్లిప్ లేకుండా ఓటు వేయలేరని వివరించారు. దీనితో పాల్‌రాజ్ తీవ్ర నిరాశతో తిరుగుముఖం పట్టారు.

దివ్యాంగులను ట్రై సైకిల్‌లో తీసుకొస్తున్న సిబ్బంది





కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న సత్యప్రద సాహు



ఇద్దరం కలిసి ఓటేద్దాం... అంటూ వెళ్తున్న వృద్ధ దంపతులు



ఓటేసిన అంధ దంపతులు



ఓటేసేందుకు వచ్చిన ఓ కుటుంబం - చంటి బిడ్డతో... హిజ్రాలు - ప్యారీస్‌లో మూతపడిన దుకాణాలు - క్యూలైన్‌లో సంచార జాతులు - ఓటు హక్కు వినియోగించుకున్న ముస్లిం మహిళలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం



వృద్ధాప్యంలో..

తొలిసారి ఓటేసిన ఆనందం



ఎంపీ, మదురై సీపీఎం అభ్యర్థి వెంకటేశన్

అక్కడ ల్యాండ్ అయితే... ఓడినట్టే

● సెంటిమెంట్

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ముహూర్త బలంతో పాటు కొన్ని సెంటిమెంట్లను బలంగా నమ్ముతుంటారు. ఆ సెంటిమెంట్లకు ఎదురుగా వెళ్ళేందుకు సాహసించరు. ఇలాంటిదే సత్యవేడులో ఓ సెంటిమెంట్‌ను రాజకీయ నాయకులు పాటిస్తుంటారు. సత్యవేడు పర్యటనకు వచ్చే ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెలికాప్టర్ ల్యాండ్ అయితే ఓడిపోవడం ఖాయమనే నానుడి ఉంది. అప్పటి ప్రధాని ఇందిర గాంధీ, ఎన్టీఆర్, చంద్రబాబు తదితరులు ఎంతో మంది ఇక్కడ హెలికాప్టర్‌ను ల్యాండ్ అయిన ప్రతీసారి అధికారం కోల్పోవలసి వచ్చిందని ఇక్కడ నాయకుల నమ్మకం.

- సత్యవేడు





అట్టుంటనా!



ఎలక్షన్ షాట్స్


చావు అయినా సంబరం అయినా టపాసులు కాల్చి సందడి చేస్తుంటారు. థౌజండ్ వాలాలు, రాకెట్లు పేలుస్తుంటారు. ఇప్పుడా ట్రెండ్ మారింది. ఒక్కొక్క రాకెట్టునూ చేత్తో పట్టుకుని ఒత్తి ఎలిగించి ఎగరేసే సీను కనిపించడం లేదు. వీటి బదులు షాట్స్ రంగంలోకి వచ్చాయి. షాట్స్ బాక్స్‌ను నేలమీద పెట్టి ఒత్తి వెలిగిస్తే చాలు వరుసగా సుయ్.. సుయ్ మంటూ గాల్లోకి దూసుకుపోయి పెద్ద శబ్దం చేస్తూ పేలుతాయి. రంగురంగుల పూలు వెదజల్లుతాయి. 30 షాట్స్ నుంచి 240 షాట్స్ దాకా మార్కెట్లో దొరుకుతున్నాయి. వీటి ధరలు రూ.1000 నుంచి 5000 దాకా ఉన్నాయి. ఎన్నికల ప్రచారాల్లో వీటికి మంచి గిరాకీ ఏర్పడింది. శ్రీకాళహస్తి సహా ప్రతి పట్టణంలోనూ టపాసుల దుకాణాలు దీపావళితో సంబంధం లేకుండా అమ్మకాలతో పండగ చేసుకుంటున్నాయి.

- శ్రీకాళహస్తి

నో స్టాక్

తిరుపతిలో చాలా వైన్ షాపులు ఎప్పుడు చూసినా మూతబడి కనిపిస్తున్నాయి. సంపూర్ణంగా మద్యం నిషేధించిన తర్వాతనే ఓట్లు అడుగుతా అని చెప్పిన జగన్ దాన్ని నిజం చేశారా అని మందుబాబులు హడలిపోతూ ఆరాలు తీస్తున్నారు. తీరా చూస్తే షాపుల ముందు నో స్టాక్ బోర్డులు వేలాడదీస్తున్నారు. రోజూ రాత్రి పది దాటినా తెరిచే ఉంటారు కదా ఇప్పుడేంది పగలే నో స్టాక్ అని పెట్టేస్తున్నారు? అని మందు ప్రియులు తెగ ఆశ్చర్యపడిపోతున్నారు. అసలు కతేమిటంటే మద్యానికి ఎన్నికల ఎఫెక్ట్ తగిలింది. ప్రచారాలకు పిలిచినా, సభలకు జనాన్ని పోగేసినా క్వార్టర్ బాటిల్ తప్పనిసరి అయ్యింది. దీంతో నాయకులు తెగ కొనేసి దాచేస్తున్నారు. అధికారంలో ఉన్న నాయకులు ప్రత్యర్థులకు ఈ అవకాశం ఇవ్వకుండా వచ్చిన స్టాకు వచ్చినట్టు దుకాణాలకు చేరకముందే తమ రహస్య ప్రదేశాలకు తరలించేస్తున్నారని చెబుతున్నారు. తిరుపతి జిల్లాలో 253 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 39 బార్లు వున్నాయి. ఇవి కాకుండా వాక్ ఇన్ లిక్కర్ స్టోర్లు నాలుగు వున్నాయి. వీటి ద్వారా రోజుకు దాదాపు రూ 6.50 కోట్లు పైచిలుకు వ్యాపారం జరుగుతోంది. ప్రత్యేక రోజులు, పండగలు, పబ్బాలు అయితే రోజువారీ అమ్మకాలు రూ 10 కోట్లు దాటుతున్నట్లు సమాచారం. ఎన్నికల రోజుల్లో పది శాతంకి మించి రోజువారీ అమ్మకాలు పెరగడానికి లేదన్నది నిబంధన. ఇందువల్లే ఏ రోజు కారోజు స్టాకు తరలిపోతోందని తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ మద్యం దుకాణాలు రాత్రి 8 గంటల వరకు తెరచి వుంచాలని, స్టాక్ అయిపోయిందని మూసివేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అధికారులు మాత్రం హెచ్చరిస్తూనే ఉన్నారు.

- తిరుపతి (నేరవి భాగం)



తిరుపతి జన చేతనం



ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైరైతే ఎలాంటి చీకూచింతా ఉండదు. టెన్షను ఉండదు. కుటుంబ సభ్యులతో నిశ్చింతగా విశ్రాంత జీవితం గడిపేయొచ్చు.

- ఇదీ పెన్షనర్ల గత ఆలోచన. వైఎస్ జగన్ జమానాలో సీను మొత్తం మారిపోయింది. ఒకటో తేదీ వస్తుందంటే వీరందరిలోనూ టెన్షన్ మొదలవుతోంది.

- తిరుపతి(కలెక్టరేట్)

వీరి ఉసురు తగలదా?



మోసం గురూ!

ప్రశాంతంగా గడపాల్సిన విశ్రాంత ఉద్యోగుల బతుకు ఇప్పుడు దినదిన గండంగా మారింది. గతంలో ఠంచనుగా ఒకటో తేదీనే పింఛను అందేది. ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా జీవించేవారు. జగన్ గద్దెనెక్కిన తరువాత పింఛనుదారుల కష్టాలు దారుణంగా తయారయ్యాయి. ఒకటో తేదీ రాగానే నెలవారీ చెల్లింపులు, ఖర్చులు, మందులకు చేతిలో నగదు లేక అల్లాడిపోతున్నారు. ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ మధ్యలో అందాల్సిన పింఛను ఎపుడు వస్తుందో తెలియదు. డీఏ, పీఆర్సీ బకాయిలకు దిక్కే లేదు. . పీఆర్సీతో పెరగాల్సిన పెన్షన్‌లోనూ కోతలు పెడుతున్నారు. వైద్య భరోసాకు ఈహెచ్‌ఎస్ కింద నగదు మినహాయించుకుంటున్నా.. ఆరోగ్య ధీమా మాటలకే పరిమితమైంది. రిటైరయ్యాక ఆర్థిక ప్రయోజనాలు సక్రమంగా అందడంలేదు. పెన్షన్‌పై ఆశతో రుణం తీసుకున్నవారు ఈఎంఐలు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. వృద్ధాప్యంలో సీఎం జగన్ తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని పింఛనుదారులు మనోవేదనకు గురవుతున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని పింఛనుదారులు కలిస్తే మంత్రులు, ఎమ్మెల్యేలను అవహేళనగా మాట్లాడిన సందర్భాలూ ఉన్నాయి. జిల్లాలో సుమారు 20వేల మందికిపైగా పింఛనుదారులున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం 70 ఏళ్ల పైబడిన పెన్షనర్లకు 10శాతం క్వాంటం, 75ఏళ్ల పైబడిన వారికి 15శాతం క్వాంటం పెన్షన్ ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ రెండింటినీ మూడుశాతం తగ్గించేశారు.



● విశ్రాంత ఉద్యోగులకు కరవైన మనశ్శాంతి ● ఒకటో తేదీన పెన్షన్ అన్నది గత కాలపు జ్ఞాపకం
● ఉద్యోగ విరమణ చేసినా అందని బెనిఫిట్స్ ● జగన్ జమానాలో లబోదిబోమంటున్న ప్రభుత్వ పెన్షనర్లు

ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు



పెన్షనర్ల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అసలు పట్టించుకోవడంలేదు. నాలుగేళ్లుగా అనేక ఆర్థిక ప్రయోజనాలను అందకుండా చేశారు. గత ప్రభుత్వాలలో నెలాఖరున లేదా 1వ తేదీన పింఛను వేసేవారు. జగన్ వచ్చాక 15వ తేదీ దాటాల్సిందే. నా సర్వీసులో ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు. ఈ ఐదేళ్లలో చాలా కష్టాలు పడ్డాం.

- గోపాల్, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్

తీవ్ర అన్యాయానికి గురయ్యాం



పాత బకాయిలు చెల్లించలేదు. ప్రభుత్వం చేతిలో అన్ని విధాల వంచనకు గురయ్యాం. డీఏలు ఇవ్వకుండానే పింఛనులో జమచేసినట్లు చూపి ఆదాయపన్ను వసూలు చేయడం అన్యాయం. పెన్షనర్లకు అన్ని రకాల వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. తీరా ప్రైవేటు ఆస్పత్రికి వెళితే పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం మాపై వివక్ష చూపుతోంది.

- జయరామనాయుడు, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ప్రశాంతత కరువైంది

ఉద్యోగ విరమణ తరువాత ప్రశాంతంగా గడపాల్సిన వారు జగన్ ప్రభుత్వ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ సమయంలో జీతం నుంచి కొంతనగదును భవిష్యత్తు అవసరాల కోసం దాచుకుంటే రిటైరయ్యాక ప్రభుత్వం చెల్లించకపోవడ దుర్మార్గం. తక్షణమే చెల్లించాల్సిన బెనిఫిట్స్ కోసం నెలల తరబడి తిప్పించుకుంటున్నారు. ఇంత అన్యాయం ఎప్పుడూ చూడలేదు.

- కృపావరమ్మ, ఏపీఎస్‌జీఆర్ఈఏ మహిళా కార్యదర్శి



చాలా ఇబ్బందులు పడుతున్నాం

గతంలో ప్రతి నెలా 1వతేదీనే పింఛను వచ్చేది. దాని మీదే ఆధారపడి జీవిస్తున్నాను. మా అబ్బాయి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.10వేలు మాత్రమే జీతం .దానికి నా పింఛను తోడైతే కుటుంబం గడిచేది. ప్రస్తుతం పింఛను జమ ఆలస్యం చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నాం.

- మునస్వామి, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి

చెవిలో పువ్వు

ఏడుకొండల మీద ఆన.. ఏమైంది సాములా?

"మీరు న్యాయమైన హక్కు కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వం మెడలు వంచి అయినా టైం స్కేలు తీసుకొస్తాం. లేదా మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు నెలల్లో టైం స్కేల్ ఇస్తాం'

- 2019లో సమ్మె చేస్తున్న ఎస్వీయూ ఎన్ఎంఆర్ ఉద్యోగుల టెంట్‌లో భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి.

సీన్ కట్ చేస్తే.. ప్రతిపక్షంలోఉండగా వీరోచితంగా పోరాడి వీరు టైం స్కేల్ తీసుకురాలేకపోయారు. మరి అధికారంలోకి వచ్చాక? ఇద్దరూ ఎమ్మెల్యేలే. పైగా సీఎంకి సన్నిహితులు కూడా. అయినా టైం స్కేల్ కత మరిచిపోయారు. ఆనాడు 300 మంది ఉద్యోగులను ఉద్దేశించి ఊగిపోతూ ప్రసంగించారు. ఆరునెలలు ఓపికపట్టండి వైసీపీ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో డిమాండ్లు పరిష్కరిస్తామని ఎదురుగా కనిపించే ఏడుకొండల సాక్షిగా ధాటీగా చెప్పి చప్పట్లు కొట్టించుకున్నారు. జేజేలు చెప్పించుకున్నారు. జగన్ సీఎం అయ్యాక వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చెవిరెడ్డికి నాలుగు పదవులు వచ్చాయి. కరుణాకర్ రెడ్డికి జోడు పదవులు దక్కాయి. ఎన్ఎంఆర్‌లకు మాత్రం మొండి చేయి మిగిలింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వెంకటగిరి వర్తమానం

వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అసమ్మతి సెగలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయన గట్టిగా ఎదురీదుతున్నారు. సామాన్యులతో కలవరనే ముద్ర పడిన ఈయన తమతో కూడా సఖ్యతగా లేరని స్వపక్ష నేతలు నెమ్మది నెమ్మదిగా దూరమవుతున్నారు. సొంత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకేమండలాల పెత్తనం కట్టబెట్టడం పార్టీలో అసంతృప్తులను రాజేసింది. రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వద్దని జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పార్టీ ఆవిర్భావం నుంచి జెండామోసిన కలిమలి రాంప్రసాద్‌రెడ్డి వంటి నేతలు బాహాటంగానే తిరుగుబాటు చేశారు. అసమ్మతి నేతలందరూ రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఇండిపెండెంటుగా పోటీచేస్తామని హెచ్చరించినా ఆయనకే టికెట్ ఖరారు చేశారు. ఇవన్నీ వైసీపీ అభ్యర్థికి ప్రతికూలాంశాలుగా మారాయి.

- వెంకటగిరి, డక్కిలి

నేదురుమల్లికి అసమ్మతి ఉక్కపోత

● వైసీపీలో కలసిరాని నాయకులు ● ఆనం ప్రభావంతో చేజారిన క్యాడర్
● యువ మహిళా అభ్యర్థితో టీడీపీలో జోష్

వైసీపీకి ఆనం స్ట్రోక్

ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరడం వైసీపీ అభ్యర్థిపై తీవ్ర ప్రభావం చూపనుంది. 2019 ఎన్నికల్లో ఈయన 38 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆయన పార్టీ మారడంతో నియోజకవర్గంలోని ఆయన అనుచరులందరూ టీడీపీ గూటికి చేరారు. ఈ పరిణామం వైసీపీకి భారీగా నష్టం కలిగిస్తుందని భావిస్తున్నారు.



నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి



కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

లక్ష్మీసాయిప్రియ అరంగేట్రం

టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న లక్ష్మీసాయిప్రియ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె. ఈమె విద్యావంతురాలు కావడంతో మహిళలు, యువతను బాగా ఆకట్టుకుంటున్నారు. ఆమె తండ్రి స్థానికుడు కావడం, ఎమ్మెల్యేగా గతంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు ఈమె విజయానికి దోహదపడనున్నాయి. ఎన్నికల ప్రచారంలో లక్ష్మీసాయిప్రియ తనదైన శైలిలో దూసుకు వెళ్తున్నారు. ప్రజలను ఆకర్షించేలా.. ఆలోచింపచేసేలా ఆమె ప్రసంగం కొనసాగుతోంది. చిన్న వయస్సులోనే రాజకీయ రంగప్రవేశం చేసిన ఈమె పట్ల సానుకూలత కనిపిస్తోంది. ఇటీవల మండలాల్లో కొందరు ప్రభావిత నేతలు తమ అనుచరులతో పెద్ద ఎత్తున వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ పరిణామం టీడీపీ అభ్యర్థికి బలాన్ని చేకూర్చింది.



● చెప్పాడంటే.. చేయడంతే!

ఈ వంతెన ఆరు నెలల్లో పూర్తి చేసేస్తా

● గూడూరులో గాల్లో కలిసిపోయిన జగన్ హామీ



గూడూరులో అసంపూర్తిగా వున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి



రైల్వే క్రాసింగ్ గేటు వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

ఎన్నో ఏళ్లుగా ఉన్న అసంపూర్తిగా ఉన్న ఈ వంతెన (ఆర్వోబీ)ను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేసేస్తా.

- 2018 జనవరి 28న పాదయాత్రగా గూడూరు వచ్చిన నాటి విపక్ష నేత జగన్ ఇచ్చిన హామీ ఇది. ఏడాదిన్నర తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. చూస్తుండగానే పదవీకాలం ముగిసింది. ఆయన ఇచ్చిన హామీ గాల్లో కలిసిపోయింది. మళ్లీ ఎన్నికల ప్రచారంలో గూడూరుకు వస్తే దీనికి ఏం చెబుతారో? ఇంకే హామీ ఇస్తారోనంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

గూడూరు నడిబొడ్డున ఉన్న గూడూరు-చెన్నై, గూడూరు-తిరుపతి రైల్వే ట్రాక్‌లు పట్టణాన్ని వన్ టౌన్, టూ టౌన్‌గా విభజిస్తున్నాయి. రైల్వే జంక్షన్ కావడంతో రైళ్ల రాకపోకలు అధికం. రెండుట్రాక్‌లపైనా గేట్లు వేస్తుండటంతో అటు ఇటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికి పరిష్కారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2010లో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేశాయి. రైల్వే శాఖ రూ.16 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.23 కోట్లు విడుదల చేశాయి. ఐసీఎస్ రోడ్డులోని ఎస్ఎంజీ పాఠశాల నుంచి మొదలయ్యే ఆర్వోబీ రెండు మార్గాలుగా విడిపోయి ఒకటి అడవయ్యకాలనీ వద్ద.. మరొకటి టూ టౌన్‌లోని సిరామిక్ కళాశాల వద్ద రోడ్డును కలవాలి. 2011 మార్చిలో పనులు మొదలయ్యాయి. రైల్వే శాఖ ఇచ్చిన రూ. 16 కోట్లతో రెండు ట్రాక్‌లపై ఆర్వోబీ నిర్మాణం పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.23 కోట్లు ట్రాక్‌లకు ఇరువైపులా బ్రిడ్జి కొనసాగింపు పనులకు చాలక ఆగిపోయాయి. భూసేకరణ, ఆర్వోబీ కోసం తొలగించిన భవనాలు, ఇళ్లకు పరిహారంతో పాటు పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మళ్లీ ప్రభుత్వం 2015లో రూ.40 కోట్లు అదనంగా మంజూరు చేసింది. రూ.36 కోట్లతో ఐదుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆరు నెలల్లో పూర్తి చేసేస్తానంటూ గత ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న జగన్.. ఐదేళ్లుగా పట్టించుకోలేదు.

- గూడూరు

తిరుపతి చరిత్ర

అధినాయక ..వేదిక

● ఎన్టీఆర్, చిరంజీవికి పట్టం కట్టిన ఆధ్యాత్మిక నగరి

● చంద్రబాబు విద్యార్థి నేతగా ఎదిగింది ఇక్కడే

తిరుపతి.. తిరుమలేశుని దర్శనానికి ముఖద్వారం. దేశంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక నగరం. మన రాష్ట్రం నుంచే కాదు దేశవ్యాప్తంగా అనునిత్యం వేలాది మంది దర్శించే ప్రాంతమిది. ఏడు కొండలవాడిని దర్శించుకోవాలంటే ఈ నగరంలో అడుగు పెట్టాల్సిందే. పేరులోనే పవిత్రత ఉట్టిపడే తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం విశేషాలు పరికిస్తే.. 1955లో తిరుపతి, రేణిగుంట మండలాల (తిరుమలతో కలిపి)తో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటైంది. ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి.

● అగ్రనేతలకు వేదిక

టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ మొదటిసారి తిరుపతినుంచే పోటీ చేసి గెలుపొందారు. ప్రజారాజ్యం పార్టీ తిరుపతిలోనే పురుడుపోసుకుంది. చిరంజీవి కూడా ఇక్కడనుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతిలోనే రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు.

ఎమ్మెల్యేలు

1955	ఆర్.నాదముని రెడ్డి	కాంగ్రెస్
1962	ఆర్.నాదముని రెడ్డి	కాంగ్రెస్
1967	ఎ.ఈశ్వర్ రెడ్డి	స్వతంత్ర
1972	వి.శిఖామణి	కాంగ్రెస్
1978	ఎ.ఈశ్వరరెడ్డి	కాంగ్రెస్(ఐ)
1983	ఎన్టీ రామారావు	టీడీపీ
1983	(ఉప ఎన్నిక) కె.శ్యామల	టీడీపీ
1985	మబ్బు రామిరెడ్డి	కాంగ్రెస్
1989	మబ్బు రామిరెడ్డి	కాంగ్రెస్
1994	మోహన్	టీడీపీ
1999	చదలవాడ కృష్ణమూర్తి	టీడీపీ
2004	ఎం.వెంకటరమణ	కాంగ్రెస్
2009	కె.చిరంజీవి	ప్రజారాజ్యం
2012	(ఉప ఎన్నిక)కరుణాకర్ రెడ్డి	వైసీపీ
2014	ఎం.వెంకటరమణ	టీడీపీ
2015	(ఉప ఎన్నిక) సుగుణమ్మ	టీడీపీ
2019	కరుణాకర్ రెడ్డి	వైసీపీ

ప్రస్తుతం
మండలాలు: తిరుపతి అర్బన్
ఓటర్ల సంఖ్య: 3,01,041
పురుషులు: 1,49,160
స్త్రీలు: 1,51,846
ఇతరులు: 35

- తిరుపతి, ఆంధ్రజ్యోతి